## 267వ అధ్యాయం

## ٢٦٧ - بَابُ تَحْرِيمِ سَبِّ الأَمْوَاتِ بِغَيْرِ حَقٍّ وَمَصْلَحَةٍ شَرْعِيَّةٍ

## చనిపోయినవారిని అన్యాయంగా, షరీఅత్ పరమైన అవసరమేదీ లేకుండా దూషించటం నిషిద్ధం

وَهُوَ التَّحْذِيرُ مِنَ الاقْتِداءِ بِهِ فِي بِدْعَتِهِ، وَفِسْقِهِ، وَنَحْوِ ذٰلِكَ؛ وَفِيهِ الآيَةُ وَالأَحادِيثُ السَّابِقَةُ فِي البابِ قَبْلَهُ.

షరీఅత్‌పరమైన అవసరమంటే బిద్అతీల బిద్అత్‌ను, పాపాత్ముని పాపాన్ని, మొదలగు వారి చెడు విషయాలను అనుసరించకుండా ఇతర ప్రజలను కాపాడటం. ఈ విషయానికి మునుపటి అధ్యాయంలోని ఖుర్ఆన్ సూక్తులు, హదీసులు కూడా వర్తిస్తాయి.

### ముఖ్యాంశాలు

గ్రంథకర్త ఇమామ్ నవవీ (రహ్మాలై) చెప్పదలచుకున్నదేమిటంటే- మరణించిన వ్యక్తి గనక బిద్అత్‌లు సృష్టించినవాడు, దైవ అవిధేయతకు పాల్పడినవాడయితే అతని చేష్టల దుష్ప్రభావం నుంచి కాపాడటానికి ప్రజలకు అతని గురించి తెలియజెప్పాలి. ఇది మృతుని గురించి చెడుగా చెప్పుకోవటం, దూషించటం క్రిందికి రాదు. పైగా అతని వాస్తవిక రూపాన్ని బయటపెట్టటంలో షరీఅత్‌పరమైన మేలు ఇమిడి ఉంది కనుక ఇలా చేయటంలో తప్పులేదు.

١٥٦٦ - وعن عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَسُبُّوا الأَمْوَاتَ؛ فَإِنَّهُمْ قَد أَفضَوا إلى ما قَدَّمُوا» رواه البخاري.

1566. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మరణించినవారు తాము చేసుకున్న కర్మలకు చేరుకున్నారు. అందుకని వారిని దూషించకండి. *(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని జనాయెజ్ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

పై హదీసు భావం ఏమిటంటే చనిపోయినవారు తాము చేసుకున్న కర్మలను బట్టి శిక్షకో లేక బహుమానానికో అర్హులైపోతారు. అలాంటి వారి గురించి మనం చెడుగా చెప్పుకోవాల్సిన అవసరం ఉండదు. కనుక చనిపోయిన వారిని ఎవరినీ తిట్టకూడదు. ముఖ్యంగా ఒకరి పేరు తీసుకొని తిట్టడం ఇంకా దిగజారిన విషయం. ఒకవేళ పైన పేర్కొనబడిన అధ్యాయపు శీర్షికలో, దాని ముఖ్యాంశాల్లో చెప్పబడినట్లు షరీఅత్‌పరంగా అలాంటి అవసరం ఏదైనా ఏర్పడితే అప్పుడు చెప్పవచ్చు.